క్లుప్తంగా

నేడు భట్టిప్రోలులో గడప గడపకు మన ప్రభుత్వం

భట్టిప్రోలు: స్థానిక 1, 2 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆయన కోరారు.

9లోగా విశ్వకర్మ యోజన పథకానికి సవరణలు

భట్టిప్రోలు: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకున్న వృత్తిదారులు ఈ-శ్రమ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 9లోగా సవరణలు చేసుకోవాలని రేపల్లె సహాయ కార్మిక శాఖ ఇన్‌చార్జి అధికారిణి వి. సాయిజ్యోతి తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ 18 రకాల వృత్తిదారులకు ఈ పథకం కింద ఐడీ కార్డుతో పాటు సర్టిఫికెట్ కూడా అందజేయనున్నట్లు చెప్పారు. 15 రోజులు శిక్షణలో రోజుకు రూ. 500తో పాటు రూ. 15 వేల విలువైన టూల్ కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడత రూ. లక్ష రుణం (18 నెలల రీపేమెంట్), రెండో విడత రూ. 2 లక్షల రుణం (30 నెలల రీపేమెంట్)ను ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఏడాదికి 5 శాతం వడ్డీ వసూలు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ



రేపల్లె రూరల్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆగంతకులు ప్రవేశించి బంగారు ఆభరణాలు చోరీ చేసిన సంఘటన పట్టణంలోని 15వ వార్డులో చోటుచేసుకుంది. ఎస్ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు.. గరువు రోడ్డు వీవర్స్ కాలనీలో నివసించే చింపిరి వెంకటేశ్వర్లు పట్టణంలోని ఓ ప్రైవేటు సంస్థలో, భార్య ఓ దుకాణంలో పని చేస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే భార్యాభర్తలు బుధవారం ఇంటి తలుపులకు తాళం వేసి విధులకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం సమయంలో రాగా తలుపులు పగలగొట్టి ఉండటంతో, దొంగలు ప్రవేశించినట్లు గమనించారు. లోపలకు వెళ్లి చూడగా బీరువా తలుపులు కూడా పగలగొట్టి ఉన్నాయి. అందులోని బంగారు నానుతాడు, చెవి బుట్టలు, ముక్కు పుడక కలిపి మొత్తం 46 గ్రాములు బంగారం, ఎనిమిది తులాల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించి, వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రజాక్ చెప్పారు. సంఘటన స్థలాన్ని క్లూస్ టీం పర్యవేక్షించింది.

ఉచిత వైద్య శిబిరంలో 1000 మందికి పరీక్షలు

పెరవలి(వేమూరు): మండలంలోని పెరవలి టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం డాక్టర్ సి.ఎస్.శాస్త్రి, లలిత జ్ఞాపకార్థం డాక్టర్లు రాధ, చంద్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్ఆర్ఐ వైద్యులు అశోక్ కుమార్, చెరువు శ్రీనివాస్, చెరువు లలితాకుమారి, చెరువు రిణి, శ్రీన వ్యాస్, నోరి సూర్యనారాయణ, గుంటూరు అమర్‌నాథ్, కుంచా శ్రీధర్, టి.వి.డి.శశిశేఖర్, తానేటి అపర్ణ, ఎం శ్రీనివాస్‌రావు, చైతన్య మలిక్ శిబిరంలో సేవలందించారు. 1000 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పలువురికి కంటి పరీక్షలు చేసి మందులతో పాటు కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాది వెంకట లక్ష్మీరాజ్యం, దాది సుబ్బారావు పాల్గొన్నారు.

17న ఒంగోలులో టైలర్స్ రాష్ట్ర మహాసభ



బాపట్ల: ఒంగోలులో ఈనెల 17న నిర్వహించనున్న టైలర్స్ రాష్ట్ర మహాసభల్ని విజయవంతం చేయాలని రాష్ట్ర టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్‌పర్సన్ షేక్ సుభాని కోరారు. బాపట్ల జిల్లా టైలర్స్ కార్యాలయంలో బుధవారం మహాసభల కరపత్రాల్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా షేక్ సుభాని మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలకు జిల్లాలో ఉన్న దర్జీలంతా హాజరై, జయప్రదం చేయాలని కోరారు. టైలరింగ్ షాపులకు 200 యూనిట్లు ఉచిత కరెంటు కేటాయించాలని, 50 ఏళ్లు నిండిన టైలర్స్‌కు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని మహాసభలో తీర్మానించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కాకి శేషగిరిరావు, విక్కీ నాగేశ్వరరావు, జానీ, ముద్దుం బాషా, నసీబ్, వేల్పుల వెంకటేశ్వర్లు, మాధవరావు, ఎం.భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

రేపల్లె: పట్టణంలోని 11వ వార్డు ఆంధ్రరత్న మున్సిపల్ స్కూలులో రూ.2.46కోట్లతో నూతనంగా నిర్మించిన భవన సముదాయాన్ని, పలు నూతన రహదారుల్ని గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గడ్డం రాధాకృష్ణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

అన్ని రంగాల్లో అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- ప్రతి ఇంటికీ సంక్షేమం
- భట్టిప్రోలులో మూడో రోజు కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున

భట్టిప్రోలు: అన్ని రంగాల్లో అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలు-1, 2 సచివాలయాల పరిధిలో ఉదయం, సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి అందరినీ ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల్ని వివరించారు. నాలుగేళ్ల పాలనలో ఏమి చేసింది.. ఇంకా ఏమి కావాలో ? అడిగి తెలుసుకున్నారు. ఓట్లేసి గెలిపించిన నేతలే ఇంటి ముంగిటకే వచ్చి అడుగుతుండటంతో ప్రజల కళ్లల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందని తెలిపారు. అభివృద్ధి సంక్షేమ పథకాల్ని ప్రజలకు అందిస్తూ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ప్రజలు బాసటగా నిలవాలని కోరారు. ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు అవాస్తవాల్ని ప్రచారం చేస్తూ ప్రజల్ని మభ్య పెడుతున్నాయని, వాటిని తిప్పి కొట్టాలని మంత్రి నాగార్జున పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో జన్మ భూమి కమిటీలు, టీడీపీ నాయకులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పథకాలు అందేవి కావని విమర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్నారని చెప్పారు. ప్రతి కుటుంబంలో నాలుగు నుంచి ఐదు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందారని తెలిపారు. ప్రతి పక్షాలు కేవలం ఉనికి కోసమే విమ్మలు చేస్తున్నాయని, వారికి ప్రజల మధ్యకు వెళ్లే ధైర్యం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, జేఏసీ మండల కన్వీనర్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఉప సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, కో-ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, పార్టీ యువజన విభాగం కార్యదర్శి పీజీ అరుణ్‌శాస్త్రి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తూనుగుంట్ల శ్రీధర్, పీఏసీఎస్ భట్టిప్రోలు చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు, పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, వేల్పూరి చిన్నారి, నాగేశ్వరరావు, పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్, కుక్కల వెంకట్రామయ్య, అబ్దుల్ కరీమ్, కుక్కల భూషణరావు, కట్టా నాగరాజు, పార్టీ నాయకులు గద్దె కిశోర్, దారా చెన్నయ్య, అబ్దుల్లా బేగ్, మద్దుల గిరిధర్, మోర్ల కోటేశ్వరరావు, పసుపులేటి శివరామ ప్రసాద్, చేబ్రోలు నాగార్జున, ఎం.ఎ. రహమాన్, గాడల్లి దాసు, యర్రంశెట్టి పార్థసారథి, తహసీల్దార్ డి. వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ బి. ఊహారాణి, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికే సంక్షేమ పథకాల అమలు

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



కర్లపాలెంలో ప్రజలకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: పేదల అభ్యున్నతికే ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. కర్లపాలెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని వివరించి కరపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసి, పరిపాలనను ప్రజల ముంగిటకు తెచ్చారని చెప్పారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి నిజమైన అర్హుల్ని గుర్తించి సంక్షేమ పథకాలు అందించేందుకు దోహదపడుతున్నారని తెలిపారు. సీఎం జగన్ ముఖ్యమంత్రి అయిన తరువాత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి మానస పుత్రికలైన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పునరుద్ధరించారన్నారు. వైద్యం అందించేందుకు పలు వ్యాధుల్ని అదనంగా చేర్చారని కోన చెప్పారు. సంక్షేమ పథకాలను అంకుంటున్న వారందరూ జగనన్న ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, కో-ఆప్షన్ సభ్యుడు అమీర్‌బేగ్, ఎంపీటీసీ సభ్యులు ఆసిఫ్ అలీ, కంకిపాటి హైమావతి, వైఎస్సార్ సీపీ నాయకులు మందపాటి పరమానంద కుమార్, యల్లావుల ఏడుకొండలు, ఆట్ల నాగేశ్వరరెడ్డి, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, మరకా పెద వెంకటేశ్వర్లు, ఆట్ల పెదశ్రీనివాసరెడ్డి, కూచిపూడి శ్యామ్యూల్ జాన్, ఆట్ల అయ్యప్పరెడ్డి, పఠాన్ అహ్మద్ భాష, కంకిపాటి నాగరాజు, కంకిపాటి నరేంద్రవర్మ, పందరబోయిన శ్రీనివాసరావు, బాబావలీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రీనివాసరావు, గ్రామ వలంటీర్లు, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్వమత సారాంశం ఒక్కటే !

- మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో శ్రీ కృష్ణ మందిరం ప్రారంభం



భట్టిప్రోలులో శ్రీకృష్ణ మందిరం ప్రారంభోత్సవంలో మంత్రి మేరుగ నాగార్జున



వెల్లటూరులో రథోత్సవం ముందు కోలాటం నిర్వహిస్తున్న బృందం



రేపల్లెలో కృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భట్టిప్రోలు: సర్వమత సారాంశం ఒక్కటేనని, మనుషుల్ని ప్రేమించి, ఆదరించి, ఆదుకోవడమే దైవతత్వమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున పేర్కొన్నారు. భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో పునర్నిర్మించిన శ్రీ కృష్ణ మందిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. దాతల సహకారంతో శ్రీ కృష్ణుని దేవస్థాన పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మంత్రి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని మతాలు మంచిని, మానవత్వాన్ని బోధిస్తాయని అన్నారు. ద్వేష భావాన్ని నూరి పోసే మతాలు అసలు మతాలే కావని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడ్ని కోరుకున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు. పూజల్ని కొత సత్య వెంకట సత్య నాగ రాజేష్‌శర్మ శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు టి. ఉదయభాస్కరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీను జేఏసీ మండల కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, పీఏసీఎస్ డైరెక్టర్ కుక్కల వీరరాఘవయ్య, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, మాజీ ఎంపీపీ మాచర్ల హేమ సుందరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, కమిటీ నిర్వాహకులు ఆదిన శ్రీనివాసరావు, ఆదిన సుబ్రహ్మణ్యం, యాదవ సంఘీయులు పాల్గొన్నారు.

- భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని గీతా జ్ఞాన మందిరంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భగవద్గీత పారాయణ చేశారు. అనంతరం పుర వీధుల్లో రథోత్సవం నిర్వహించారు.ఇందులో చుండూరు మండలం నడిగడ్డపాలెం గ్రామానికి చెందిన కోలాట బృందంప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో గీతా మందిర కమిటీ సభ్యులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెంలో...

మండలంలోని మంతెనవారిపాలెం శివారు యాదవపాలెంలో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకల్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం ఆవరణలో స్వామికి గ్రామస్తులు పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై స్వామిని ఉంచి గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపల్లెలో ఘనంగా కృష్ణాష్టమి



రేపల్లె ఓల్డ్ టౌన్ యాదవపాలెం రామాలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

కృష్ణాష్టమి వేడుకల్ని పట్టణం, మండలంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓల్డ్ టౌన్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో, ఉప్పూడి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, 1వ వార్డులో కృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓల్డ్ టౌన్ యాదవపాలెం రామాలయంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, గోపూజా ఘనంగా నిర్వహించారు. జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ సకల దేవతా స్వరూపం గోమాతన్నారు. గోవుల్ని పూజించడంతో సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. గోవుల్ని ప్రతి ఒక్కరూ పూజించాలని సూచించారు. అనంతరం ఆలయంలో హరే రామ హరే రామ... హరే కృష్ణ హరే కృష్ణ మంత్రాన్ని భక్తులు పఠించారు. కార్యక్రమంలో రేపల్లె మండల కన్వీనర్ పేరం కోటేశ్వరరావు, సహా కన్వీనర్ శౌంతి బాబూరావు, మహిళా కన్వీనర్ లంకా కృష్ణకుమారి, గొరిపర్తి రాధ, వక్కలగడ్డ వెంకట్రామయ్య, కొసనం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

రైతులకు నిత్యం అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్



అధికారులకు సూచనలిస్తున్న అబ్దుల్ సత్తార్

రేపల్లె రూరల్: రైతులకు నిరతరం అందుబాటులో ఉంటూ సాగులో సందేహాల్ని నివృత్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కార్యాలయ ఆవరణలో బుధవారం వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల్ని వివరించాలని చెప్పారు. ఇంకా పీఎం కిసాన్ యోజనకు ఈకేవైసీ చేయించుకోని వారు ఉంటే వెంటనే గుర్తించి చేయించుకునే విధంగా వారిని చైతన్యపరచాలని ఆదేశించారు. కౌలు రైతు గుర్తింపు కార్డులు కలిగిన వారు ఐదుగురు గ్రూపుగా ఏర్పడితే బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చన్న అంశాన్ని వారికి తెలియజేయాలని చెప్పారు. ఆర్బీకేలలో ఎరువుల్ని సమయానుకూలంగా రైతులకు అందించాలని సూచించారు. పంట వివరాల్ని ఈ-క్రాప్ బుక్కింగ్‌లో నమోదు చేయించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. 13వ తేదీలోపు పంట నమోదు పూర్తయ్యేలా పని చేయాలని ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ అక్తర్ హుస్సేన్, ఏవో వాగోలు బుష్, ఏఈవో ఎం.ప్రభాకర్ పాల్గొన్నారు.

నగరంలో...

రైతులంతా తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ సత్తార్ చెప్పారు. మండలంలోని నగరం, బొరమాదిగపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాల్ని నమోదు చేయాల్సిన బాధ్యత వీఏఏలదేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం వరి పంటకు ఆకుచుట్టు పురుగు ఆశించిందని, నివారణకు క్లోరిఫైరిపాస్ ఎకరానికి 300 మి.లీ. లేదా ఏసిఫేట్ ఎకరానికి 300గ్రా 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె. రమేష్‌బాబు, ఏఈవో కె.నాగశ్రీనివాసరావు, వీఏఏలు పాల్గొన్నారు.

ఆసక్తికరంగా ఎడ్ల బండ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న కృష్ణార్జునరావు

భట్టిప్రోలు: శ్రీకృష్ణ యాదవ సేవా సమితి (అద్దేపల్లి) ఆధ్వర్యంలో బుధవారం స్థానిక టీఎంరావు హైస్కూలులో ఎడ్ల బండ్ల పోటీలు ఎంతో ఆసక్తికరంగా జరిగాయి. విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కుందేటి కృష్ణార్జునరావు-వరలక్ష్మి దంపతులు ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. పోటీల్ని ఆ దంపతులు ప్రారంభించారు. పోటీలు డ్రా పద్ధతిలో జరిగాయి. ఈ సందర్భంగా కృష్ణార్జునరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో మరుగున పడిన ఎడ్ల పందెల్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రథమంగా ఎడ్ల బండ్ల పోటీల్ని నిర్వహించేందుకు విశ్రాంత ఎస్పీ కృష్ణార్జునరావు ముందుకు రావడం అభినందనీయమన్నారు. పోటీల్లో కామరాజుగడ్డ బసవయ్య(గుత్తావారిపాలెం), ఆదిన శివనాగరాజు, బాలసుబ్రమణ్యం (భట్టిప్రోలు), డొక్కు సుబ్బారావు(అద్దేపల్లి), పసుపులేటి కృష్ణ (సూరేపల్లి), చిట్టిబొమ్మల నాంచారయ్య-ఐలవరం, గొరిపర్తి భార్గవి(అద్దేపల్లి) ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ, పంచమ బహుమతుల కింద రూ 15,116, రూ.10,116, రూ.5,116, రూ.4,116, రూ.3,116 అందుకున్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చందలూరి రామ కోటేశ్వరరావు, కరస్పాండెంట్ పి. మల్లికార్జునరావు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు కుందేటి శ్రీనివాసరావు, కుందేటి శివన్నారాయణ, కుందేటి రమేష్, కుక్కల జయప్రసాద్, నాలి వెంకటేశ్వరరావు, కుక్కల వెంకటేశ్వరరావు, జి. శ్రీనివాసరావు, డొక్కు శ్రీనివాసరావు, డొక్కు వెంకటేశ్వరరావు, కుందేటి యుగంధర్, కొణతం మురళీకృష్ణ, గొరిపర్తి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. పోటీల్ని తిలకించేందుకు భట్టిప్రోలు మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వానను సైతం లెక్క చేయకుండా పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చారు.

ఉదయనిధి స్టాలిన్‌ను కఠినంగా శిక్షించాలి



కొల్లూరు బస్టాండ్ సెంటర్లో ఆందోళనకారులకు సర్ది చెబుతున్న ఎస్ఐ

కొల్లూరు : సనాతన ధర్మాన్ని అవహేళన చేస్తూ వ్యాఖ్యలు చేసిన తమిళనాడు సీఎం కుమారుడు, ఆ రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను తక్షణం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బజరంగ్ దళ్ నేతృత్వంలో నేతలు బుధవారం కొల్లూరు బస్టాండ్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నిస్తుండటంతో కొల్లూరు ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి అడ్డుకున్నారు. దీంతో బజరంగ్‌దళ్ నాయకులు ఆమెతో వాగ్వివాదానికి దిగారు. ఆమె సర్ది చెప్పారు. శాంతియుతంగా నిరసన చేపట్టుకోవాలే గానీ, రెచ్చగొట్టే ధోరణులు వద్దని వారించడంతో దిష్టిబొమ్మ దహనాన్ని విరమించుకున్నారు. నిరసనలో బజరంగ్ దళ్ నాయకులు ఆలూరి వెంకటేష్, తుంగల హరీష్, రాంపల్లి జగన్నాథశాస్త్రి, గల్లా వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

9న పెదలంకలో ఆర్బీకే ప్రారంభం

భట్టిప్రోలు: మండలంలోని పెదలంక పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఈ నెల 9న ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్ గుమ్మడి సాంబశివరావు బుధవారం తెలిపారు. రూ. 21.80 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, వ్యవసాయ శాఖ నిధులతో ఈ భవనాన్ని నిర్మించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఆర్బీకే కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రారంభోత్సవానికి మంత్రి మేరుగ నాగార్జున హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

పదో తరగతి చదివిన వారికి 'ఉపాధి' శిక్షణ

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో 100 రోజులు పూర్తయి, జాబ్ కార్డులో పదో తరగతి చదివిన వారికి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో చొప్పర శేఖర్ తెలిపారు. వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో 8న శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మండలంలోని 17 గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పూర్తయి జాబ్ కార్డులో పదో తరగతి చదివిన వ్యక్తులుంటే ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకురావాలని సూచించారు. శిక్షణ కాలంలో రోజుకు రూ. 272 స్టైఫండ్ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కొలువుదీరిన గణనాథులు



పూజకు సిద్ధమవుతున్న విగ్రహాలు

చెరుకుపల్లి: తొలిపూజ శివపార్వతి తనయుడు గణనాథుడికే సొంతం. ఏ పని ప్రారంభించినా విఘ్నాలు తొలగి, సిరిసంపదలతో తులతూగాలని ఆయనకే పూజ చేస్తాం. రానున్న వినాయకచవితి నేపథ్యంలో ఆయన విగ్రహాల తయారీనే పనిగా కొన్ని కుటుంబాలు జీవిస్తున్నాయి. గణనాథుడే వారి జీవన ఆదాయం. వినాయక చవితి వారి జీవితంలో ఏటా వచ్చే పెద్ద పండుగ. గణనాథుడి ప్రతిమల తయారీ, విక్రయమే వారి వృత్తి. ఏడాదంతా కష్టపడి, వ్యయ ప్రయాసలకోర్చినా.. భాద్రపద శుద్ధ చవితి..తమ బాధలన్నీ మర్చిపోయే రోజు అని, రాజస్థాన్ నుంచి ఇక్కడ స్థిరపడి వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నవారు చెబుతున్నారు. వినాయక చవితి వేడుకల్ని సెప్టెంబరు 18న ప్రజలందరూ ఘనంగా జరుపుకోనున్నారు. చవితి ఉత్సవాలకు సంబంధించి భారీ గణనాథుడి ప్రతిమలకు ఇప్పటికే డిమాండ్ ఏర్పడింది. చాలా మంది బొమ్మల కొనుగోలుకు తయారీదారులకు ఆర్డర్లు ఇచ్చేశారు. దీంతో వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయమైన రంగులతో వినాయకచవితికి రెండు నుంచి 12 అడుగుల భారీ వినాయకుని విగ్రహాలను అమ్మకానికి తయారీదారులు సిద్ధం చేశారు.

వేగంగా విగ్రహాల బుకింగ్



విగ్రహాల తయారీ దారుడు పూనారామ్

రేపల్లె, వేమూరు, బాపట్ల నియోజకవర్గాల గ్రామాల్లో వినాయక చవితి వేడుకలకు ఇప్పటికే నిర్వహణ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. విగ్రహాల కొనుగోలుకు అడ్వాన్స్‌లు కూడా చెల్లించేశారు. మండలంలోని గుళ్లపల్లి, చెరుకుపల్లి గ్రామాల్లో చిన్నాపెద్దా అన్ని కలిపి..ఈ ఏడాది 300వందల గణనాథుడి విగ్రహాలు తయారు చేసినట్లు రాజస్థాన్‌కు చెందిన పూనారాం చెబుతున్నారు. ఇప్పటి వరకు 60 బొమ్మలకు అడ్వాన్సులు చెల్లించారని తెలిపారు. గత పదేళ్ల నుంచి ఆయన ఇక్కడే వినాయ విగ్రహాలు తయారు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు, కూలీలను పెట్టుకుని ఇదే వృత్తిగా ఆయన జీవిస్తున్నారు. గతేడాది 200 విగ్రహాలు విక్రయించామని, అయినా అవి చాలలేదని పూనారం చెప్పారు. వినాయక ప్రతిమలు ఎత్తు అడుగలను బట్టి ధర ఉంటుందని చెబుతున్నారు.